క్లుప్తంగా

హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

సత్తుపల్లిరూరల్: గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు కోరారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కోసం ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు పండ్ల తోటల పెంపకంకు అయ్యే ఖర్చులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. గుంతలు తీసే ఖర్చు, మొక్క నాటేఖర్చు, మొక్కల ఖరీదు ప్రతి నెల ఒక మొక్కకు రూ.15లు చొప్పున నిర్వాహణ ఖర్చులు, మూడు సంవత్సరాల పాటు నిర్వాహణ ఖర్చులు రైతు బ్యాంక్ ఖాతాకు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు జాబ్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సమీపంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కల్లూరు: మూడు నెలలుగా చెల్లించని వేతనాలను కార్మికులకు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ మధుకు వినతిపత్రం అందించారు. పెండింగ్ వేతనాలు చెల్లించేవరకు నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకుడు దామాల దయాకర్‌రావు, కార్మికులు వంశీ, ప్రమోద్, కృష్ణ, నాగమణి, రమాదేవి, లక్ష్మీప్రసన్న, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సింహా

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా తెలిపారు. పట్టణంలోని 13వ వార్డులో ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మంగళవారం డ్రెయినేజీలో పూడికతీత పనులు, పిచ్చిమొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు బాబురావు, రామారావు పాల్గొన్నారు.

గ్రేస్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బిషప్ ఎంఎం జాకబ్, సిబ్బంది

కొణిజర్ల: జీటీ ఎస్ఎస్ఎస్ సంస్థ చైర్మన్ బిషప్ ఎంఎం జాకబ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తనికెళ్లలోని గ్రేస్ జనరల్ ఆస్పత్రిలో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని బిషప్ ఎంఎం జాకబ్ ప్రారంభించారు. 150 మంది గ్రేస్ సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు రక్తదానం చేశారు. అంతకు ముందు బిషప్ జాకబ్ జన్మదిన సందర్భంగా ఆస్పత్రిలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రేస్ ఆస్పత్రి యాజమాన్యం శామ్యూల్ జాకబ్, డాక్టర్ విక్టోరియా ఎలిజిబెత్, గ్రేస్ విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామ రెవెన్యూ పరిధిలో 190 సర్వే నంబర్‌లోని తమ భూములను కొందరు ఆక్రమించారని మంగళవారం బాధిత రైతులు తల్లపురెడ్డి సీతారావిఎరెడ్డి, తల్లపురెడ్డి వెంకటరెడ్డి, సామినేని శ్రీనివాసరావు, తల్లపురెడ్డి ప్రసన్నరెడ్డి, శీలం వెంకట జ్యోతి.. తహసీల్దార్ ఎం.ఉషాశారదకు వినతిపత్రం అందించారు. తమ భూముల గట్టు రాళ్లు తొలగించారని, అట్టివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ..



పుల్లయ్యను పరామర్శిస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు నల్లమల పుల్లయ్య ఇటీవల అనారోగ్యానికి గురికాగా సీపీఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, మోహన్‌రావు, కృష్ణయ్య, కృష్ణయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. భూమికి రక్ష

- సేంద్రియ పదార్థాలతో మేలు
- అధిక దిగుబడి
- సూచనలు చేస్తున్న అధికారులు



గరికపాడు సొసైటీలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)



దాచాపురం గ్రామ శివారులోని పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుతున్న రైతు

వైరారూరల్: పంటల సాగులో అధిక దిగుబడులను సాధించాలని రైతులు ఆశిస్తున్నారు. దీనికి అనుగుణంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి సాగును ప్రోత్సాహించే దిశగా రైతులు పచ్చిరొట్ట విత్తనాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తోంది. పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం మరింత పెంపొందుతుంది. పచ్చిరొట్ట విత్తనాలపై జనుము, జీలుగులను వ్యవసాయ శాఖ అధికారులు సొసైటీలలో అందుబాటులో ఉంచి ఎకరాకు 10 కిలోల చొప్పున అందిస్తున్నారు. వ్యవసాయ భూములను దుక్కులు చేసిన అనంతరం పచ్చిరొట్ట విత్తనాలను వేస్తే 40 నుండి 50 రోజుల్లో ఏపుగా పెరుగుతుంది. దీనిని కాలియదున్నితే వారంలోపు పచ్చిరొట్ట కుళ్లి సేంద్రీయ ఎరువుగా మారుతుంది.

మండలంలోని వివరాలిలా..

వైరాలోని మండలంలోని వైరా, గరికపాడు, పూసలపాడు సొసైటీల పరిధిలోని రైతులకు 1,250 క్వింటాళ్ల జీలుగులు, 110 క్వింటాళ్ల జనుములు ప్రభుత్వం నుంచి అందాయి. ఇప్పటికే 2,299మంది రైతులు 1,055 క్వింటాళ్ల జీలుగులను కొనుగోలు చేయగా మరో195 క్వింటాళ్లు మాత్రమే సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయి. అలాగే 110 క్వింటాళ జనుములు రాగా 59 మంది రైతులు 72 క్వింటాళ జనుములు కొనుగోలు చేయగా సొసైటీల్లో మరో 38 క్వింటాళు మాత్రమే రైతులకు అందుబాటులో ఉన్నాయి.

ప్రయోజనాలు..

- పచ్చిరొట్ట విత్తనాలు భూమిలో కలియదున్నడం వల్ల సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందుతాయి. భూసారం పెరుగుతుంది.
- భూమిని గుల్లపరిచి నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- పప్పు ధాన్యాల వంటి కొన్ని పచ్చి రొట్ట విత్తనాలు భూమిలో నత్రజని స్థాయిని పెంచి ఇతర పంటల పెరుగుదలకు సహకరిస్తాయి.
- పచ్చిరొట్ట విత్తనాలు భూమి కాలుష్యం, క్షీణతను తగ్గిస్తాయి.
- రసాయనిక ఎరువుల కంటే తక్కు ఖర్చుతో సులభంగా అందుబాటులో ఉంటాయి.
- పచ్చిరొట్టతో భాస్వరం, గంధకం లభ్యత చాలా పెరుగుతుంది.

రైతులకు ఎంతో మేలు..



రైతులు రసాయన ఎరువులు ఉపయోగించడానికి బదులుగా పచ్చిరొట్ట సాగు చేయాలి. దీంతో ఎన్నో విధాలుగా ఉపయోగం ఉంటుంది. పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. సహజసిద్ధంగా ఎరువులు తయారవడంతో పంటలో రసాయనాల శాతం కూడా తగ్గుతుంది. అయితే చాలా మంది రైతులకు పచ్చిరొట్ట గురించి ఎక్కువగా తెలియడం లేదు.

– మయాన్ మంజుఖాన్, ఏఓ, వైరా

కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండండి



ఎమ్మెల్యే రాగమయిని సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, తదితరులు

సత్తుపల్లిటౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని జవహర్ నగర్, జంగాల కాలనీలలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ జెండాలు ఆవిష్కరించటంతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. పీసీసీ జనరల్ సెక్రటరీగా నియమితులైన ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, రామిశెట్టి సుబ్బారావు, ఉడతనేని అప్పారావు, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, ఎండి కమల్ పాషా, దూదిపాల రాంబాబు, పింగళి సామేలు, దేవళ్ల పెద్దిరాజు, శోభన్‌బాబు, హౌసింగ్ ఏఈ పవన్ పాల్గొన్నారు.

13నుంచి శిక్షణా తరగతులు

వైరా: ఈ నెల 13, 14, 15 తేదీల్లో కామేపల్లి మండలం లింగాల క్రాస్‌రోడ్డులో ఉన్న ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సీపీఎం వైరా డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. మంగళవారం వైరాలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణలో ప్రజా సమస్యలపై భవిష్యత్ పోరాటాలకు నాయకత్వం వహించే దిశగా ఈ రాజకీయ శిక్షణా తరగతులు ఉపయోగ పడతాయన్నారు.

ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం



క్రీడాకారులతో నిర్వాహకులు

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. ఈ వేసవి శిక్షణా శిబిరంలో అనేక మంది క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు. కోచ్ అమిరేశి లింగయ్య క్రీడాకారులకు మెళుకువలను తెలిపారు. సబ్‌జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఆడే క్రీడాకారులకు ఈ వేసవి శిక్షణా శిబిరం ఎంతగానో ఉపయోగపడింది. బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులందరికీ మెమెంటోలను అందజేశారు.

పీసీసీ కార్యవర్గంలో స్థానంపై హర్షం



రంగారావును సన్మానిస్తున్న నాయకులు



సత్యనారాయణ

వైరా: తాజాగా ప్రకటించిన టీపీసీసీ కార్యవర్గంలో వైరా వాసులకు స్థానం దక్కింది. వైరాకు చెందిన కట్ల రంగారావు, నూతి సత్యనారాయణ గౌడ్ ఇప్పటికే పీసీసీ కార్యదర్శులుగా కొనసాగుతుండగా ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక నాయకులు వీరి నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. అలాగే, రంగారావు సత్కరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు రేచర్ల నాగేశ్వరరావు, సయ్యద్ అన్వర్, రేచర్ల పుల్లయ్య, దార్న రాజశేఖర్, ఫణితి సైదులు, శ్రీను, వీరబాబు, సీతారాములు, సత్యం, రామకృష్ణ, మహేష్, దుర్గాప్రసాద్, మోహనరెడ్డి, భాస్కర్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ జిల్లా నాయకులు

మధిర: జులై 19, 20వ తేదీల్లో మధిరలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మండడపు రాణి తెలిపారు. మంగళవారం మధిరలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మధిర రిక్రియేషన్ క్లబ్ నందు జరిగే సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మధిర మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, జిల్లా సమితి సభ్యులు రహీం, ప్రకాశ్‌రావు, లక్ష్మణ్, మురళి, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం




మాట్లాడుతున్న పోతేపల్లి సోమయ్య

బోనకల్: దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతేపల్లి సోమయ్య, విద్యావిభాగం సభ్యుడు బండారు రమేష్ తెలిపారు. మండలంలోని చిరునోములలో మధిర డివిజన్ రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించగా.. వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు, నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రామనర్సయ్య, సురేష్, 5మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం.. భవితకు ఉపకారం

- ఎన్‌ఎంఎంఎస్‌కు జిల్లాలో 99మంది విద్యార్థులు ఎంపిక
- సత్తా చాటిన సత్తుపల్లి విద్యార్థులు



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలు(ఎన్‌ఎంఎంఎస్) ఆర్థిక భరోసా ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి. ఇటీవల వెలువడిన ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 99 మంది విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి ఎంపికకాగా.. వారిలో సత్తుపల్లి ప్రభుత్వ బాలికల హైస్కూల్ నుంచి 11మందితో అగ్రస్థానంలో నిలువగా, కాకర్లపల్లి హైస్కూల్‌లో 8మంది, తుంబూరు హైస్కూల్‌లో నలుగురు ఎంపికయ్యారు.

ఏడాదికి రూ.12వేలు చొప్పున..

8వ తరగతిలో నిర్వహించే పరీక్షతో ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికై 9వ తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్) వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున మొత్తం రూ.48వేలు ఉపకార వేతనాలు అందిస్తారు. ఇవి నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. ఇప్పటి వరకు ఎంపికైన విద్యార్థులు పూర్తిస్థాయిలో వీటిని సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణిస్తున్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం



తల్లాడ: మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేందర్ గౌడ్

తల్లాడ/కల్లూరురూరల్/ముదిగొండ: భూ భారతి చట్టం ద్వారా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆర్డీఓ ఎల్.రాజేందర్, తహసీల్దార్లు సురేష్‌కుమార్, పులి.సాంబశివుడు, సునీతా ఎలిజిబెత్, డీటీలు లక్ష్మి, బాబ్జీప్రసాద్ తెలిపారు. మంగళవారం తల్లాడ మండలంలోని రామానుజవరం, అంబేడ్కర్‌నగర్ గ్రామాల్లో, కల్లూరులోని.. ఖాన్‌ఖాన్‌పేట, ఎర్రబోయినపల్లిలతో పాటు ముదిగొండ మండలంలోని మాదాపురం, కమలాపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వారు పాల్గొని మాట్లాడారు. రైతులు అందించిన దరఖాస్తులను పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమాలల్లో సీనియర్ అసిస్టెంట్ స్టాలిన్, ఆర్ఐలు ఉమామహేశ్వరరావు, సుజాత, భాస్కర్, ఖాజా మొయినుద్దీన్, రెవెన్యూ సిబ్బంది, జీపీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

రేపల్లెవాడలో పంటల పరిశీలన



పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఏన్కూరు: మండలంలోని రేపల్లెవాడలో వేసిన పత్తిపంటలను ఏఓ నర్సింహారావు మంగళవారం పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమిలో తేమ ఉన్నప్పుడు విత్తనాలు వేసుకోవాలని, పత్తి పంటను బోదేసాళ్ల పద్ధతిలో వేయడం వలన భూమికి తేమ నిలుపుకున్న శక్తి ఎక్కువ పెరుగుతుందన్నారు. మొక్క నీటి ఎద్దడికి తక్కువగా గురి అవుతుందన్నారు. బీటీ–3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేనందున ఎవరు సాగు చేయొద్దన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకృష్ణ, శ్రీకాంత్, నవ్య, భవ్య, లహరి పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన శీలం రామలింగయ్యపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5వ తేదీన గ్రామానికి చెందిన షేక్ షభాన ఇంటి ముందు రోడ్డుపై రామలింగయ్య ట్రాక్టర్ ట్రక్కును అడ్డుగా పెట్టడంతో పాటు ఈ రోడ్డు నాదని.. ఈ దారిలో నడిస్తే చంపేస్తామని బెదిరించాడు. ఈ మేరకు షభాన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగులక్ష్మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

చిన్నారులకు ఉచితంగా ఫిజియోథెరపీ



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

కారేపల్లి: నడవలేని పాక్షిక పక్షవాతం ఉన్న చిన్నారులకు మంగళవారం కారేపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ అందించారు. ఈ సదర్భంగా వైద్యులు రూతమ్మ, ఐఆర్‌పీ శైలజ దివ్యాంగులకు వైద్యసేలు అందించారు. అదే విధంగా దివ్యాంగులైన చిన్నారులకు విధిగా చికిత్స చేయించినట్లయితే అనేక ప్రయోజనాలు ఉన్నాయని, దూరంనుంచి వచ్చేవారికి దారి ఖర్చులుసైతం వారిఖాతాలో జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది కమల తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మాకేది..?



తాళ్లూరు వెంకటాపురంలో ఓ కుటుంబం నివాసం ఉంటున్న గుడిసె

కల్లూరురూరల్: ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ.. వాస్తవానికి నిజమైన పేదలకు మాత్రం ఇల్లు అందడం లేదు. రాజకీయ జోక్యం, స్థానిక పరిస్థితులు గృహాలు మంజూరు షక్య తగ్గిపోవడం తదితర కారణాల వల్ల నిజమైన లబ్ధిదారులకు ఇళ్లలు అందని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గానికి కేటాయించిన గృహాల్లో మండలాల వారీగా, గ్రామాల వారీగా, కులాల వారీగా విభజించడం వల్ల పలు గ్రామాల్లో గృహాలు లేని నిరుపేదలు ఉన్నప్పటికీ వారందరికి గృహాలు మంజూరు కావడం లేదు. పలుచోట్ల రేకులు ఉన్నవారికి ఇళ్లలు వచ్చిన సందర్భాలు ఉన్నాయి కానీ.. గుడిసెలో బతికేటోళ్లకు మాత్రం ఇల్లు మంజూరు కాలేదు. గత ప్రభుత్వంలో ఇల్లులు రాని నిరుపేదలు ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఇస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. రాజకీయాలకు తావులేకుండా కుల మతాలకతీతంగా గృహాలు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన..

- గుదిబండలుగా మారిన చెత్త ట్రాక్టర్లు
- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు



తనికెళ్లలోని ప్రధాన వీధిలో నిలిచిన మురుగునీరు



కొణిజర్లలో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది (ఫైల్)

కొణిజర్ల: గత కొన్నేళ్లగా ప్రతీ గ్రామంలో చెత్త బండి వచ్చిందమ్మా, తడి చెత్త – పొడి చెత్త వేరు చేసి తీసుకరండి అంటూ వేస్తున్న మైకు కూతలు గత కొన్ని నెలలుగా వినిపించడం లేదు. పంచాయతీలకు పాలక వర్గాలు లేక ప్రత్యేకాధికారులు పంచాయతీలపై దృష్టి పెట్టక గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా ఎక్కడి చెత్త అక్కడ ఉంటుంది. వచ్చేది వానాకాలం నాలాలు శుభ్రం చేయించని పక్షంలో మురుగు నీరు బయటకు పోయే పరిస్థితి ఉండదు.

మండలంలోని వివరాలిలా..

కొణిజర్ల మండలంలో 27 పంచాయతీలుండగా సుమారు 51 హ్యాబిటేషన్లు ఉన్నాయి. గతంలో పంచాయతీలకు పాలక మండళ్లు ఉంటే ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా సర్పంచ్‌లు తమ సొంత ఖర్చులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. గత ఏడాది కాలంగా పంచాయతీలకు పాలక మండళ్లు లేక ఒక్కో మండల స్థాయి అధికారికి మూడు నుంచి నాలుగు పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో వారు తమ శాఖాపరమైన పనులతో పంచాయతీల పర్యవేక్షణ కూడా చేయాలంటే తలకు మించిన భారంగా మారింది. దీంతో పంచాయతీలలో పర్యవేక్షణ తగ్గింది. మరో వైపు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక మండళ్లు ఏర్పాటు చేయక పోవడంతో పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు వాటా నిలిచిపోయింది.

సిబ్బందికి అందని వేతనాలు..

రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా విడుదల చేస్తున్న గ్రాంట్లు సిబ్బంది జీతాలకు కూడా సరిపోవడం లేదు. ముఖ్యంగా చిన్న పంచాయతీ, ఇటవలే పంచాయతీలుగా మారిన తండాల పరిస్థితి దారుణంగా ఉంది. జనరల్ ఫండ్ లేక ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో పంచాయతీ కార్యదర్శులే సొంత ఖర్చులతో పనులు చేయించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రతి పంచాయతీలో చెత్త ట్రాక్టర్ తిప్పడానికి డీజిల్‌కు కూడా డబ్బులు లేక నెలకు రూ.10 వేల వరకు పంచాయతీ కార్యదర్శులే భరిస్తున్నారు. కొన్ని పంచాయతీలలో భరించే పరిస్థితి లేక ట్రాక్టర్లను నిలిపివేస్తున్నారు.

కార్యదర్శుల వెతలు..

ప్రస్తుతం వానా కాలం కావడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే బ్లీచింగ్ పౌడర్ సిద్ధంగా ఉంచుకోవాలి. వీధి దీపాల మరమ్మతులు వాటి బిల్లలు చెల్లింపులు తదితర విషయాలకు కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారాయి. ఇక సభలు సమావేశాలు జరిగినప్పుడు షామియానా దగ్గర నుండి భోజనాల వరకు ప్రతి ఖర్చు కార్యదర్శుల నెత్తినే వేస్తున్నారు. సదరు పనులకు తర్వాత బిల్లు వస్తుందో రాదో అని తర్జన భర్జన పడుతూనే కార్యదర్శులు ఖర్చులు పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి వానాకాలం ముందస్తుగానే పారిశుద్ధ్య పనులకు నిధులు కేటాయించి పంచాయతీలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చెత్త సేకరణ చేయిస్తూనే ఉన్నాం..



పంచాయతీల్లో చెత్త సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్న మాట వాస్తవమే అయినా చెత్త సేకరణ కుంటు పడవద్దని ఉన్న కొద్దిపాటి నిధులు చెత్త సేకరణకే ఖర్చు పెడుతున్నాం. గ్రామాల్లో ఇంటి పన్నులు సకాలంలో చెల్లించకపోవడంతో జనరల్ ఫండ్ కూడా వాడుకునే పరిస్థితి లేదు. వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

– ఏ.రోజారాణి, ఎంపీడీఓ, కొణిజర్ల